# మల్లెమొగ్గల గొడుగు

## అంటరానోళ్ళ ఆత్మకతలు

# తేడా

మా వోళ్లల్లో రావంత గొప్ప సదువు సదివి పట్నంలో నౌకరి చేస్తా వుండాడు మా సుందరం బావ. యెప్పుడో పల్లెటూరు యిడిసిబెట్టి పోయినాల ముంచి చానారోజులు మా వూరిమొకం జూడలా! ఈ వడమ బాగా సంపాయిచ్చి గొప్పోడైనంక పెళ్ళాం పిల్లల్ని దీసుకోని రొండుసార్లు మావూరికొచ్చిండు. యాదో మావోల్ల మీవ దయగలిగింది గావాల! సూసేదానికొచ్చిండని అనుకున్నారంతా.

అదే మాదిరిగా యిప్పుడు సుందరమ్మ పెళ్ళికి పెళ్ళాన్ని, పిల్లల్ని దీసుకోని వొకరోజు ముందుగానే వొచ్చిండు.

మా బావని జూసి చానా రోజులయ్యింది. పొయ్యి పలకరిచ్చుకుందామని శాంతమ్మింటికి బొయ్యినా. నేను బొయ్యేలేకి మా సుందరం బావ బిర్రవ బిగదీసుకోని కూసోనున్నడు. నన్ను జూసి గూడ పలకరిచ్చలా!

"యాం బావా! బాగున్నావా? ఏంచేసైంది వొచ్చి?" అని నేనే పలకరిచ్చుకున్నా.

"ఆ బాగున్నా యీడ బలే యెండలెక్కువ మన్నయి. గాలే అడ్డంలే!" అంటా అండవతో యిసురుకుంటా వున్నడు.

సుందరాన్ని చూసే దానికొచ్చిన మా సుట్టాలు కొంతమంది ముసిముసి నవ్వులు నవ్వుకుంటా వున్నరు.

శాంతమ్మకి సుందరం అన్న వరసవుతడు. అందు కనే గమ్మునుంది. లేకుంటే ఈవరకే సుందరాన్ని యాదో వొక మాటని సురుక్కుమనిపిచ్చేది. మాది పల్లెటూరు గదా! ఎవురూ యాదీ మన సులో బెట్టుకోరు.

"యావయ్యా! సుందరమా! యిప్పుడంటే నువ్వు పట్నం బొయ్యి నైసు నేర్చినావు. పాను బెట్టుకోని పల్లంగా గాలి కింద కూసోమంటవు గావాల. ఆడ మాదిరి మనూల్లో ఎట్ట జరగతది అల్లుడా!" సుందరం బుగ్గలు పొడిసి అన్నది అత్త వరసయ్యే పుల్లమ్మ.

ఇంగ అదిజూసి అందురూ పెద్దంగ నవ్వుకున్నరు.

సుందరానికి కోపమొచ్చి అన్నుంచి లేసి బయటికి బొయ్యి పందిట్లో కూసున్నడు.



"యీడు యిప్పుడు సుకం మరిగిండు గానీ, ఈడి తాత, నాయిన ఈ వూర్లోనే కస్టం జేసు కోని బతికి, ఈల్లని యింతటోల్లని జేసి ఈన్నే సచ్చింన్రు". యీర తాత ఆడున్నోల్లతో అన్నడు.

"మనల్ని మర్సిపోకుండా వొస్తున్నడు గదా జూసే దానికి? ఇంగ మీకు పవేం లేదు గావాల" శాంతమ్మ గట్టిగా కసిరేలేకి అందురూ నోర్లు మూసుకున్నరు. సుందరం పెళ్ళాం వొంటినిండా నగలు దిగేసుకోని పొట్టుకోక సుట్టుకోని పీటమీవ కూసోనుంది. మావూరి పిలకాయలందరూ సుట్టూ జేరి ఇచ్చింత్రంగా జూస్తున్నరు.

మా రాజమ్మొదిన ఆమెని జూసి మూతిదిప్పుకోని బోతావుంది.

ఇంగ నేను నవ్వుకోని రాజమ్మొదిన్ని బిలిచినా!

"యాందొదినా! మూతి బలే దిప్పినావు. యాంది కత?" అనడిగినా.

"ఆ శాంతమ్మ నోటికి బయపడి గమ్మునుండా గానీ యిందాకే కడిగేద్దును నాయినా. వోల్లకి మన మీవ మనసుండి గాదు వొచ్చేది. వోల్ల సొమ్ములు, గొప్పలు, కోకలు సూపిచ్చుకోను" అన్నది

"పోనియ్యిలే వొదినా! రోజులు మారవా? మనోల్లు గూడా బాగుపడొద్దా? వోల్లు బాగు పడితే మనం బాగుపడ్డట్టు గాదా?" అన్నా నేను.

"నిజమే నాయినా! బాగుపడి మనల్ని మర్చి పొమ్మన్నమా? పుట్టినూరే పరాయిదైపోయ్యిందా? వొచ్చినోల్లు మంతో కల్పిమెల్పి వుంటరా? మన తిండి తింటరా? అన్నీ పెసల్‌గా కనిగిరి నుంచి తెప్పిచ్చుకుంటరు. ఆన్నుంచి పలావు దెచ్చుకోని తింటరు.

మన బియ్యం ముతగ్గా వుంటయ్యంట.

పట్నంలో బియ్యానికి పాలీసుబెట్టి తెల్లంగా జేస్తరు గానీ రుచీపచీ వుంటదా? వుత్త సెత్తదిన్నట్టు. పల్లె టూరి తిండిలో వున్న బలం ఆడుంటదా?" అంటా యిరుసుకోని బడతావుంది వుంది రాజమ్మొదిన.

ఇంగ కొంచేపు నేనాన్నే వుంటే సంగతి పెద్దదవు ద్దన్ని పనుందన్జెప్పి ఆన్నుంచి మా ఇస్రాయేల్ బావ కాడికి బొయ్యినా.

*　　　　*　　　　*

నేను బోయి సూసేలోకి నట్టింట్లో పీట మీన కూసోని సంకటి ముద్దలు తింటా వున్నడు.

"రాసుదయ్యా సంకటి తిందువు గానీ!"అన్న పిలిసినాడు.

"యాంది బావా!రోజులు మారినా నువ్వు సంకటి ముద్దలు తినటం ఇంకా మానలా?" అనడిగినా.

ఇస్రాయేలు బావ నవ్వినాడు.

'ఇప్పడేం జూసినావు గానీ సుదయ్యా! నేను ఎలగ రెడ్డి యింట్లో పాలేరుగున్నప్పడు సూడాల్సింది వాకత. వోల్లు నన్ను బాగా జూసుకున్నరు. తర్వాత చంద్రారెడ్డి గారింట్లో పాలేరుతనం జేసేటప్పడయితే యేడు ముద్దల సంకటి తినేవోణ్ని.

అది సాలక "అమ్మా! కొంచెం వున్నీల్లు బొయ్యమ్మా!"అనే వోన్ని.

రెడ్డమ్మ కంచంలో వున్నీల్లు బోస్తది. దాంట్లో ఉప్పగల్లు యేసుకొని అట్టట్టా దివ్వుకోని ఆ వున్నీల్లు తాగేవోణ్ని.

నా యాకలి రెడ్డమ్మకి దెల్సిపోయ్యేది. "యేవిరా! ఇంకొంచెం సంగటి యేపిచ్చుకోగూడదా!" అనేది.

'యేడు ముద్దలు తిన్న తర్వాత యింగా మేమియే యేపిచ్చుకునేదని నేను చిగ్గుపడేవోన్ని. ఇంకా చాల్లేదు కావాల అన్జెప్పేసి వాళ్లనుకునే వోల్లు. తర్వాత వోల్లింట్లో పని జాలిచ్చుకున్నా.

ఆయేడు వానల్లేక పంటల్లేక బొయ్యె. ఇంగ పనుల్లేక యిక్కట్లు బడి రెడ్డిగారి కాడ పని మానేసినా.

పనికి బోయిన రోజు తిండి పెడతరు గానీ పనికిబోని రోజుపెట్టే దానికి ఎవురున్నరు? ఆరోజు





వస్తే!

మనూరి తోటల్లో సొద్దపైరు పండుద్ది. ఆకలి తట్టుకోలేక సొద్ద తోటల్లోకి వడిమద్దెలోకి బొయ్యేది. సొద్దకంకులు ఇరుసుకోని తినేది. ఆ కంకుల మోట్లు దీసుకొచ్చి యెవురూ సూడకుండా బాయిలో పడేసేది.

అప్పట్లో ఆరకంగా కాలం గడిపినా"

గిన్నెలో చేతులు గడుక్కుంటా జెవుతున్నడు ఇస్రాయేలు బావ.

'రోజులు మారినయ్యని యెవకటి రోజులు మర్చిపోతమా సుదయ్యా! సొంతవూర్ని మర్చిపొయ్యినోడు కన్నతల్లిని మర్చిపొయ్యినట్టు గాదూ!

బండారి సుధాకర్